# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ములుగు నియోజకవర్గంలో పోటెత్తిన ఓటర్లు
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- పోలింగ్ కేంద్రాల్లో సకల సౌకర్యాలు
- పలు బూత్‌లను సందర్శించిన అధికారులు
- భారీ బందోబస్తు నిర్వహించిన పోలీసులు


వెంకటాపూర్ : ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ములుగు రూరల్, నవంబర్ 30 : ములుగు నియోజకవర్గానికి సంబంధించి గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని అదనపు ఎస్పీ సదానందం పరిశీలించారు. మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ములుగులోని పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు బడే నాగజ్యోతి, సీతక్క, ప్రహ్లాద్ సందర్శించారు. కాగా, గురువారం రాత్రి

### ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : మండలంలోని 28 పోలింగ్ స్టేషన్ల పరిధిలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పోలీసు బందోబస్తు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండల కేంద్రంలోని 45వ పోలింగ్ కేంద్రలో మొదట ఈవీఎం మొరాయించడంతో అధికారులు దానిని మార్చారు. అక్కడక్కడా వృద్ధులు వెలుతురు సరిగా లేకపోవడంతో ఈవీఎంలోని గుర్తులు కన్పించక ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు దంపతులు 51వ పోలింగ్ స్టేషన్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, ఏఎస్పీ సంకీర్త్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 4 గంటలు దాటినప్పటికీ క్యూలో ఓటర్లుండడంతో వారికి ఓటు వేసే అవకాశాన్నిచ్చారు. సమయం దాటిన తర్వాత వచ్చిన ఒకరిద్దరిని అనుమతించలేదు. ఎమ్మెల్యే సీతక్క పోలింగ్ స్టేషన్లను సందర్శించారు.

### ఛత్తీస్‌గఢ్ నుంచి హోంగార్డులు

చత్తీస్‌గఢ్‌కు చెందిన 300 మంది హోంగార్డులు ఇక్కడ ఎన్నికల విధులు నిర్వర్తించారు. ఏటూరునాగారం సబ్ డివిజన్‌కు సుమారు 150 మందిని పిలిపించారు. జిల్లాలో సిబ్బంది తక్కువగా ఉండడంతో తొలిసారి వీరిని విధుల్లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సబ్ డివిజన్ పరిధిలో70 మంది అటవీ శాఖ ఉద్యోగులు కూడా విధులు నిర్వర్తించినట్లు అధికారులు తెలిపారు.

### మంగపేటలో..

మంగపేట : మండలంలోని 46 పోలింగ్ స్టేషన్లలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 37,887 ఓట్లుండగా, అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు. నిబంధనల ప్రకారం సాయంత్రం 4 గంటలకు పోలింగ్ కేంద్రాల మెయిన్ గేట్లు మూసి వేశారు. అయితే కొన్ని గ్రామాల్లో ఓటర్లు పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం 3 గంటల తరువాత కేంద్రాలకు రావడంతో సాయంత్రం ఆరు దాటే వరకు పోలింగ్ నిర్వహించారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

### వెంకటాపూర్‌లో..

వెంకటాపూర్ : మండలంలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 31,916 ఓటర్లుండగా 40 పోలింగ్ బూత్‌లలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 4 గంటలకే సమయం ముగిసినా పోలింగ్ కేంద్రం లోపలికి వచ్చిన ఓటర్లకు స్లిప్పులు అందజేసి అధికారులు ఓటింగ్‌ను కొనసాగించారు. మండలంలోని లక్ష్మీదేవిపేట పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం పరిశీలించారు. మండలంలోని నారాయణపూర్‌లో మాజీ ఎంపీ సీతారాం నాయక్, రామంజాపూర్‌లో ఎంపీపీ బుర్ర రజితాసమ్మయ్య, నర్సాపూర్‌లో జడ్పీటీసీ గై రుద్రమదేవీఅశోక్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నల్లగుంట, పాలంపేట, వెంకటాపూర్ గ్రామాల్లో ఓటింగ్ సరళినిఎన్నికల పరిశీలకుడు రత్నాకర్ ఝూ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని 103 బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో సుమారు గంటన్నర ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మండలంలో మండలంలోని ఇంచెంచెరువుపల్లి, లక్ష్మీదేవిపేటలో చిన్న గొడవ జరుగగా పోలీసులు సర్ది చెప్పారు. డీసీసీఆర్‌బీ డీఎస్పీ సుభాష్ రెడ్డి, ఎస్సై చల్లా రాజు భద్రతా చర్యలు చేపట్టారు.


వెంకటాపూర్ : ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రత్నాకర్ ఝూ

### తాడ్వాయిలో..

తాడ్వాయి : మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సాయంత్రం నాలుగు గంటల వరకు 86 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే మండలంలోని లింగాల, బందాల, నార్లాపురం, బొల్లెపల్లి పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 7 గంటల వరకు కొనసాగింది. ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉండటంతో పోలింగ్ అధికారులు నాలుగు గంటలకు ముగించాల్సిన పోలింగ్‌ను 7 గంటల వరకు కొనసాగించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి తన స్వగ్రామం కాల్వపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లతో కలిసి క్యూలైన్లలో వేచి ఉండి ఓటు హక్కును వినియోగించుకుంది. ఎలాంటి ఘటనలు జరుగకుండా ఎస్ఐ ఓంకార్ యాదవ్ బందోబస్తు నిర్వహించారు.


గోవిందరావుపేట : లక్ష్మీపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న యువకులు


కన్నాయిగూడెం : బారులు తీరిన ఓటర్లు


వాజేడు : ఓటు వేసినట్లు చూపుతున్న పెనుగోలు ఓటర్లు

### గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : మండలంలో గురువారం జరిగిన శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 18 గ్రామ పంచాయతీల్లో 24,207 మంది ఓటర్లుండగా 19,600 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 4 గంటల వరకు 81 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి యువకులు పట్టణాల నుంచి భారీగా తరలివచ్చి ఓటు వేశారు. వృద్ధులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పస్రా సీఐ శంకర్ ఆధ్వర్యంలో ఎస్సై మస్తాన్ బందోబస్తు నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి, కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క పోలింగ్ సరళిని పరిశీలించారు.

### కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం : మండలంలోని 14 పోలింగ్ కేంద్రాల్లో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 4 గంటలకు గేట్లను బంద్‌చేసి పోలింగ్ స్టేషన్‌లో ఉన్న ప్రజలందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. మండలంలో మొత్తం ఓటర్లు 9,274 మంది ఓటర్లున్నారు. కన్నాయిగూడెం బూత్ నెంబర్ 24, ముప్పనపల్లి 28వ బూత్‌లో ఓటర్లుండటంతో రాత్రి 7 గంటల వరకు అధికారులు పోలింగ్‌ను కొనసాగించారు.

### వాజేడులో..

వాజేడు : మండలంలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఏజెన్సీ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బలగాలు పెద్ద ఎత్తున మోహరించాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలైన్లో వేచి ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుగోలు గిరిజన గ్రామం నుంచి సైతం 16 మంది ఓటర్లు మూడు గుట్టలు దిగి, మూడు వాగులు దాటి వచ్చి జంగాలపల్లి 17వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. వృద్ధులను వీల్‌చైర్‌లో కేంద్రంలోపలికి తీసుకెళ్లి ఓటు వేయించారు.

### వెంకటాపురం (నూగూరు)లో..

వెంకటాపురం (నూగూరు) : మండలంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో గురువారం ముగిశాయి. మండలంలోని 32 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 83.40 శాతం ఓటింగ్ నమోదైంది. ఏజెన్సీ మారుమూల ప్రాంతమైన మండలంలోని పోలింగ్ కేంద్రాలను పోలీసు అధికారులు పరిశీలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు ఓటింగ్ సరళిని పరిశీలించారు. సీఐ బండా రికుమార్, ఎస్సైలు రేఖ అశోక్, కొప్పుల తిరుపతిరావు, ఎంపీడీవో అడ్డూరి బాబు, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ ఆధ్వర్యంలో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది.


మంగపేట : వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న వలంటీర్లు


ములుగు రూరల్ : ములుగులోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు


ఏటూరునాగారంలోని 51వ పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు


వెంకటాపురం (నూగూరు) : బారులు తీరిన ఓటర్లు


మంగపేట : బోరునర్సాపురంలో బారులు తీరిన ఓటర్లు


ఏటూరునాగారం : రామన్నగూడెంలో..


తాడ్వాయి : ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ప్రజలు

## ఎన్నికల సామగ్రిని అప్పగించిన అధికారులు

ములుగు రూరల్, నవంబర్ 30 : ములుగు నియోజకవర్గ జరిగిన ఎన్నికల అనంతరం రాత్రి ఓటింగ్ ఆఫీసర్లు వారికి కేటాయించిన ప్రత్యేక బస్సుల్లో ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. ఈ మేరకు వారికి కేటాయించిన స్టాల్స్ వద్ద ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రిని సెక్టార్ అధికారులకు అప్పగించారు. రాత్రి 7 గంటల నుంచి అర్ధరాత్రి వరకు అధికారులు ఎన్నికల సామగ్రిని పోలీస్ బందోబస్తు నడుమ డిగ్రీ కళాశాలకు తరలించారు. అనంతరం అధికారులు వాటిని ప్రత్యేక వాహనాలలో కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంకు తరలించి భద్రపర్చారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి ఎన్నికల సామగ్రి అప్పగించే ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ నెల 3న కౌంటింగ్ నిర్వహించి అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు.


ములుగు రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎన్నికల సామగ్రితో వస్తున్న అధికారులు


ములుగు రూరల్ : సామగ్రి అప్పగించే ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ త్రిపాఠి, ఆర్వో అంకిత్